క్లుప్తంగా

అర్హులకే రుణాలు మంజూరు చేయాలి



ఎంపీడీవో ఉషారాణికి వినతి అందజేస్తున్న లిల్లి

మునగపాక: కార్పొరేషన్ రుణాల మంజూరులో అర్హులకే అవకాశం కల్పించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు బొడ్డేడ లిల్లి కోరారు. గురువారం ఆమె ఎంపీడీవో ఎం.ఉషారాణికి వినతి అందజేశారు. ఇటీవల బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారని, అయితే అర్హులైన వారికి రుణం అందించేలా చూడాలని కోరారు. రుణ మంజూరులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. పార్టీ యువజన విభాగం నాయకుడు జగన్‌మోహన్ పాల్గొన్నారు.

'మోడల్' ప్రవేశాల కోసం మెరిట్ లిస్టు



ఆరో తరగతి మెరిట్ లిస్టు

మునగపాక: పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థుల మెరిట్ లిస్టు అందుబాటులో ఉంచామని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. ఏప్రిల్ 21న ఆరో తరగతిలో చేరేందుకు గాను ప్రవేశ పరీక్ష జరిగిందన్నారు. పేపర్ వాల్యుయేషన్ అనంతరం మెరిట్ వివరాలను అందుబాటులో ఉంచామని, విద్యార్థులు పరిశీలించుకోవాలని కోరారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సేవలు మరువలేనివి



సూర్యనారాయణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగులాపల్లి గ్రామస్తులు

మునగపాక: రైతుల సంక్షేమం కోసం డీసీఎంఎస్ మాజీ చైర్మన్, దివంగత యల్లపు సూర్యనారాయణ ఎనలేని సేవలందించారని శాస్త్రవేత్త చదరం శివాజీ పేర్కొన్నారు. మండలంలోని నాగులాపల్లి పాలకేంద్రం ఆవరణలో సూర్యనారాయణ విగ్రహం వద్ద గురువారం పలువురు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సూర్యనారాయణ పాల సంఘం అధ్యక్షునిగానూ సేవలందించారన్నారు. గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మళ్ల ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ యల్లపు భాస్కరరావు, యల్లపు వెంకటప్పారావు, భీమరశెట్టి భాస్కరరావు, బొడ్డేడ గోవింద, శరగడం జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు



విద్యార్థిని త్రిషకు మిఠాయి తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: చదువులో ఏకాగ్రత చూపితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. పదో తరగతిలో 559 మార్కులు సాధించిన గణపర్తి హైస్కూల్ విద్యార్థిని చదరం త్రిషను ఆయన గురువారం అభినందించి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత కాళ్ల చంద్రమోహన్, రోలుగెడ్డ నీటి సంఘం అధ్యక్షుడు చదరం నూకప్పారావు, సీఆర్ఎంటీ కర్రి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం



హనుమాన్ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

మునగపాక: హనుమాన్ జయంతి వేడుకలను ఈ నెల 22న ఘనంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నాగులాపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ గ్రామంలో భజనలు, పౌర్ణమి హారతులు, సంకీర్తనలు వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో దైవభక్తి పెంచాలన్నారు. 22న హనుమాన్ జయంతిలో భాగంగా ప్రతి గ్రామంలో కాషాయి జెండా ఎగరాలన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల రాధాకృష్ణ, ఆడారి గంగాధర్, రాకలపాటి అరవింద్, నరేంద్ర చౌదరి, ముచ్చకర్ల సత్యనారాయణ, కొణతాల వెంకటరావు, వరహాలు, వెంకటరమణ, వీర మహేష్ పాల్గొన్నారు.

యమపాశాలు

- చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు
- లైన్లు సరిచేయని అధికారులు
- భయాందోళనలో ప్రజలు



రేవుపోలవరం సమీపంలో నేలపై నడిపిన విద్యుత్ సర్వీస్ వైరు



చినఉప్పలంలో విద్యుత్ వైర్లకు చుట్టుకుని మృతిచెందిన పాడిపశువు(ఫైల్)



పేటసూదిపురంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం లైను

ఎస్.రాయవరం: గ్రామాల్లో విద్యుత్ తీగలు యమపాశాలుగా మారి మృత్యు పంజా విసురుతున్నాయి. ఇవి చేతికందే ఎత్తులో ఉండటంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ఎక్కడ తగిలి ప్రాణాలు పోతాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వీటిని సరి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యవసాయ మోటార్లకు ఆక్వా, ఉప్పు పరిశ్రమలకు వెళ్లే లైన్లు చేతికందే ఎత్తులో ఉంటున్నాయి. కొన్ని చోట్ల నేలపై నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. ఇందంతా ఆ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్లకు తెలిసినప్పటికీ సరిచేసే చేయడం లేదు. కొందరు రైతులు, పరిశ్రమల నిర్వాహకులు వారికి అవసరమైన చోట విద్యుత్ వినియోగం కోసం అధికారులకు, లైన్‌మెన్లకు తెలియకుండా స్థానిక ప్రైవేటు లైన్‌మెన్ సహాయంతో అనధికారకంగా లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విధంగా చిన, పెద ఉప్పలం గ్రామాల పరిధిలో ఆక్వా, ఉప్పు పరిశ్రమలకు వెంకటాపురం, వాకపాడు, రేవుపోలవరం తదితర గ్రామాల్లో ఆక్వా పరిశ్రమలకు ఏర్పాటు చేసుకున్నారు.

ఏమాత్రం ఆదమరచినా ప్రాణాలు పోవడమే..

పాడి పశువులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఏమాత్రం ఆదమరచినా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది. ఇటీవల చినఉప్పలంలో ఓ పాడి గేదె విద్యుత్ తీగలు తగిలి మృతవాత పడింది. అయినప్పటికీ ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు సరిచేసే పనులు ఆ శాఖ అధికారులు తీసుకోవడం లేదు. కొరుప్రోలు కలింగల్ వద్ద ట్రాక్టర్ బాటలో విద్యుత్ వైర్లు వేలాడుతున్న లైన్‌మన్‌కు పట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించి సక్రమ పద్ధతిలో లైన్లు అమర్చాలని కోరుతున్నారు. అధికారులు మాత్రం చేతికందే వైర్లు ముట్టుకోవద్దు.. తడిచిన స్తంభాలు పట్టుకోవద్దని ప్రచారాలు చేస్తున్నారే తప్ప ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న ఉన్న తీగలను సరి చేసే పనులు మాత్రం చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి



గ్రామంలో మేత కోసం వెళ్లిన పాడి గేదె నేలకందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి మృత్యువాత పడింది. సుమారు రూ.80 విలువ చేసే పాడిగేదె చనిపోయింది. ప్రమాదం తర్వాత ఆదుకున్న నాథుడే లేడు. పొలాల్లో విద్యుత్ వైర్లతో మేము భయంతో తిరగాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. మాకు నష్టపరిహారం ఇప్పించాలి.

– భజన వెంకటలక్ష్మి, పాడిరైతు, చినఉప్పలం, ఎస్.రాయవరం మండలం

లైన్లు సరిచేస్తాం



విద్యుత్ వైర్లు నేలకందే ఎత్తులో ఉన్నవి మా దృష్టికి వస్తే సరి చేస్తున్నాం. చిన ఉప్పలంలో జరిగిన ప్రమాదంపై విచారణ చేపట్టాం. ఆ రైతుకు నష్టపరిహారం ఇస్తాం. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తాం. మిగిలిన గ్రామాల్లోనూ ప్రమాదకరంగా ఉన్న లైన్లు సరిచేసేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకుంటాం.

– బి.గోపి, విద్యుత్ శాఖ ఏఈ, కొరుప్రోలు సబ్ స్టేషన్, ఎస్.రాయవరం మండలం

ఎమ్మార్పీఎస్ నాయకునికి ఘన నివాళి



వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీఐ అప్పన్న

పాయకరావుపేట: ఎమ్మార్పీఎస్ మాజీ నాయకుడు, స్వర్గీయ మల్లవరపు వీరభద్రరావు చిత్రపటానికి పూలమాల వేసి సీఐ జి.అప్పన్న ఘనంగా నివాళులర్పించారు. వీరభద్రరావు 60వ జయంతి కార్యక్రమం స్థానిక చిత్రమందిర్ థియేటర్ వద్ద ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యుడు కుందూరు రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మజ్జిగ పంపిణీ చేపట్టారు. వీరభద్రరావు అభిమానులు, కుటుంబ సభ్యులు తుమ్మలపల్లి కుమార్, తుమ్మలపల్లి లక్ష్మణ్‌రావు, వేమగిరి లక్ష్మణ్‌రావు, తుమ్మలపల్లి తాతబ్బాయి పాల్గొన్నారు.

యువత సమస్యలపై పోరాడుతా

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు సియాద్రి బుజ్జి



అచ్యుతాపురం: నియోజకవర్గంలో యువతకు సంబంధించిన సమస్యలపై పోరాడుతానని వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు సియాద్రి బుజ్జి తెలిపారు. ఇటీవల తనను ఈ పదవికి ఎంపిక చేసిన అధినేత జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సెజ్ కంపెనీలపై ఎంతైనా ఉందన్నారు. చీమలాపల్లి సర్పంచ్‌గా ఇక్కడి ప్రజలకు సేవ చేస్తున్నానని, రానున్న నియోజకవర్గంలో యువకులందరినీ కలిసి వారి గొంతుకకు నాలుకగా మారుతానని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల: కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం మే డే కావడంతో ఉపాధి హామీ పథకం పని ప్రదేశానికి వెళ్లి అవగాహన కల్పించారు. స్కూల్ కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను ఆధ్వర్యంలో ఉపాధి కూలీలను కలిసి ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా నాణ్యమైన విద్య అందుతోందని వివరించారు. ఇందుకు ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనమన్నారు. పైసా ఫీజు చెల్లించనవసరం లేదని, ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతామని వివరించారు. ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్, లోవరాజు, శంకరరావు, గ్రామస్తులు గోవిందు, దొరబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ

మునగపాక: స్థానిక గౌతన పఠన మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్రాంత స్కూల్ అసిస్టెంట్ కిల్లాడి ప్రసాదరావు సహకారంతో తెలుగు నీతి పద్యాలు, సౌందర్యలహరి, 1 నుంచి 5 వతరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అబాకస్ నేర్పిస్తామన్నారు.

పారిశుధ్యలోపం తలెత్తకుండా చర్యలు

డీపీవో శిరీషారాణి



రేగుపాలెంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

యలమంచిలి రూరల్: మండలంలోని రేగుపాలెం గ్రామ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్ శిరీషారాణి గురువారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యలోపం తలెత్తకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామ పంచాయతీలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు గ్రామంలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, ఎంపీడీవో కొండలరావు, పంచాయతీ విస్తరణాధికారి దీపిక, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఎన్నో ఉపయోగాలు



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు



శ్లోకాలు పాడుతున్న బాలిక



అచ్యుతాపురంలో వేసవి శిక్షణ

కోటవురట్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక పఠనం వల్ల కలిగే ఉపయోగాలు, కథలు చెప్పడం ద్వారా ఆలోచనా ధోరణి ఎలా ఉంటుంది తదితర అంశాలను వివరించారు. గ్రంథాలయ సందర్శన మంచి అలవాటని, రోజూ పుస్తక పఠనంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో డస్టర్ గేమ్ ఆడించారు.

పాయకరావుపేట: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, ఇంగ్లిషు గ్రామర్, రామాయణం, యోగా నేర్పించినట్టు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి నర్సు హాజరై వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్లు ఎస్.సీతారామయ్య, వై.అచ్యుతరావు, రాజు పాల్గొన్నారు.

ఇతిహాసాల్లో నీతిని ఆచరించాలి

అచ్యుతాపురం: రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల్లో నీతిని గ్రహించాలని రిసోర్స్ పర్సన్ కే లోవకుమార్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం ఆయన నీతి కథలు బోధించారు. క్రమశిక్షణాయుత జీవితాన్ని అలవరుచుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబానికి బాసట



బాధితుడు ప్రసాద్‌కు నగదు అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నక్కపల్లి: పొట్టకూటి కోసం రాష్ట్రాలు దాటి వెళ్తూ లారీపై నుంచి పడి కాళ్లు, చేతులు విరిగిపోయి చికిత్స తీసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడికి దేవవరం గ్రామానికి చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బాసటగా నిలిచారు. గ్రామానికి చెందిన నమ్మి ప్రసాద్ పశువుల వ్యాపారుల వద్ద కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 15 రోజుల క్రితం కూలి పని నిమిత్తం పశువులను తీసుకుని తమిళనాడుకు వెళ్తూ లారీపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా, చెన్నై ఆస్పత్రిలో సర్జరీ చేశారు. మూడు నెలల పాటు ఇంటికే పరిమితం కావాలని వైద్యులు సూచించారు. దాంతో కూలికి వెళ్తేగాని పూట గడవని పేద కుటుంబం కావడంతో ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు గ్రామస్తులు రూ.32,332 చందాలు సేకరించారు. ఈ మొత్తాన్ని గురువారం ప్రసాద్ ఇంటికి వెళ్లి అందజేశారు. అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. గతంలో ఇదే కమిటీవారు రైలు ప్రయాణంలో కాలు కోల్పోయిన యువకుడికి ఆర్థిక సాయం అందించి తమ మానవత్వం చాటుకున్నారు. కష్టకాలంలో అండగా నిలిచిన ఉత్సవ కమిటీకి గ్రామస్తులకు ప్రసాద్ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం

- అనకాపల్లి ఆర్డీవో అయిషా

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అనకాపల్లి ఆర్డీవో అయిషా ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రోడ్డు విస్తరణకు సంబంధించి జరుగుతున్న పనుల వివరాలను తహసీల్దార్ ఆదిమహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగులాపల్లిలో చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు. రహదారి విస్తరణలో భూములు, గృహాలు కోల్పోయే క్రమంలో నిర్వహించిన కొలతల ప్రక్రియలో తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి బాధితునికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. డీటీ శేషుబాబు, వీఆర్వో నూకసూరి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా రెపరెపలు

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు



యలమంచిలి రూరల్: మున్సిపల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు



యలమంచిలి రూరల్: ఆటో స్టాండ్ వద్ద మేడే వేడుకల్లో యూనియన్ నాయకులు



యలమంచిలి రూరల్: యలమంచిలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



మునగపాక ఆటో స్టాండ్ వద్ద పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: పట్టణంలో అరుణ పతాకాలు నింగికెగిసి రెపరెపలాడాయి. గురువారం మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, యూనియన్ల నాయకులు ఎర్ర జెండాలను ఎగురవేశారు. హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు గనిశెట్టి సుదాసు ఎగురవేశారు. రాజీలేని పోరాటాల ద్వారానే కార్మికుల హక్కుల సాధన సాధ్యమన్నారు. స్థానిక ఆటో స్టాండు వద్ద ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లిమళ్ల నాగు ఎర్ర జెండా ఎగురవేశారు. తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు ఏ శంకరావు, రైస్ మిల్ ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో అధ్యక్షుడు వీసం వెంకటరమణ, పులపర్తి ఆటో స్టాండు వద్ద అధ్యక్షుడు బంగారు అప్పలనాయుడు ఎర్ర జెండాలను ఎగురవేసి కార్మికుల ఐక్యత వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్మిక సంఘాల నాయకులు వై నూకరాజు,సీ హెచ్ వెంకటరమణ,డి మహేష్,జైరామ్,ఎస్ శివ,విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక జీవిత బీమా సంస్థ బ్రాంచి కార్యాలయం నుంచి బస్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఫ్యూజన్ బ్రిక్స్ కంపెనీ వద్ద ఎర్ర జెండా ఎగురవేశారు. మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, నాయకులు శ్రీనివాసు, నగిరెడ్డి సత్యనారాయణ, చిరంజీవి, లక్ష్మి, రేవతి, జ్యోతి, రుత్తల సత్యనారాయణ పాల్గొన్నారు.

మండల న్యాయ సేవాధికార సంస్థ, కార్మిక శాఖలు ఓ ప్రైవేటు హార్డువేర్ షాపులో నిర్వహించిన సమావేశంలో కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తులు పి. విజయ, సహాయ కార్మిక శాఖాధికారి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి

నక్కపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో నక్కపల్లిలో గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులు, పెయింటింగ్ కార్మికులు, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్, ఉపమాక రోడ్డు, ఆటో స్టాండు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం, టోల్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో కార్మిక జెండాలను ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు ఈ నెల 20న దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మిక సమ్మె చేయబోతున్నామన్నారు. కార్మిక సంఘ నాయకులు రాజేష్, దుర్గారాణి,తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే శరణ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వైఎస్ భద్రం కోరారు. ఉమ్మలాడలో తాపీమేస్త్రి సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామదాసు, రైతు సంఘ నాయకులు కోరిబిల్లి శంకరరావు, శరగడం సుబ్రహ్మణ్యం, మద్దాల రాము, మొల్లేటి వాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలో ఏఐటీయూసీ నాయకుడు నాయుడు మల్లికార్జునరావు పతాకావిష్కరణ చేశారు. పరదేశి, కామరాజు, అప్పారావు, గోవిందరావు పాల్గొన్నారు. గవర్ల అనకాపల్లిలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, రాముల ఆధ్వర్యంలో పతాకావిష్కరణ గావించారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద పలువురు ఆటో డ్రైవర్లు, కార్మికులు పతాకావిష్కరణ చేశారు.

అచ్యుతాపురం రూరల్: మండలంలో పలు చోట్ల సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు. అచ్యుతాపురం కూడలిలో యువశక్తి ఆటో యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐ నమ్మి గణేష్ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. అనంతరం కార్మికులతో ర్యాలీ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, కర్రి నాయుడు, తట్టా రాజు, రెడ్డి సన్నిబాబు, రాజాన అప్పలనాయుడు, నిమ్మాడ చిన్నారావు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: కార్మిక దినోత్సవం సందర్భంగా తుని, పాయకరావుపేట సాయి శ్యామల తాపీమేస్త్రీ సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఐదుగురు తాపీమేస్త్రీలను ఘనంగా సన్మానించారు. అనంతరం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తుని – పాయకరావుపేట పట్టణాలకు చెందిన తాపీ మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం రూరల్: అచ్యుతాపురం కూడలిలో నినాదాలు చేసిన కార్మికులు



అచ్యుతాపురం రూరల్: మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ నమ్మి గణేష్



నక్కపల్లి ఆటోస్టాండ్ వద్ద కార్మిక జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



మునగపాక: ఉమ్మలాడలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు భద్రం



మునగపాక: నాగులాపల్లిలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు మల్లికార్జునరావు

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును పాతిన రెవెన్యూ సిబ్బంది

అచ్యుతాపురం రూరల్: మండలంలోని కొత్తూరు మోసయ్యపేట గ్రామంలో సర్వే నంబరు 166కు సంబంధించి చెరువు పోరంబోకులో వెలసిన పాకను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. అక్కడ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆక్రమణలపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో గురువారం ఇక్కడ పాకను తొలగించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా నేరమని, అట్టి వారు భూ పరిరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరిక బోర్డులో తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఈశ్వర కుమార్, సర్వేయర్ రాధ, వీఆర్వో చిన అప్పారావు, వీఆర్ఏ తట్టా శ్రీను పాల్గొన్నారు.